సూర్యుడు తనలోతాను కాలిపోతున్నాడు ఎఱ్ఱగా. రూప చెప్పుల్లేని కాళ్ళు నల్లటి తారురోడ్డు మీద త్వరత్వరగా నడుస్తున్నాయి. ఆమె నుదుటిమీద పట్టిన స్వేదబిందువులు బొట్లు బొట్లుగా ముక్కుమీదికి జారి, అక్కడినించి పెదవులమీద పడుతున్నాయి. రూప బరువుగా ఒక నిట్టూర్పు విడిచి, చేతిరుమాలుతో చెమటని తుడుచుకుంది

పొట్టలో ప్రేగులు నకనకలాడుతున్నాయి. వాటినివినే ధ్యాసలో లేదు ఆమె. గంటక్రితం జరిగిన యింటర్వ్యూ గురించి ఆలోచిస్తోంది మేనేజింగ్ డైరెక్టరు నాగేంద్ర పాసం తన గురించి, తన కుటుంబం గురించి అన్నీ అడిగి తెలుసుకుని ఎంతో జాలిపడ్డారు. సాయంత్రం ఆయనుండే బంగళాకి వస్తే ఏ సంగతీ చెబుతానన్నారు. ఎంత మంచి వ్యక్తి? ఇంకా ఈ సమాజంలో మంచితనం బొత్తిగా పోలేదు అనుకుంటూ యింటికి చేరుకుంది రూప.




ఇంట్లో అడుగుపెట్టిన పెద్దకూతుర్ని చూసి "ఏమ్మా యింటర్వ్యూ ఏమయింది" అనే ప్రశ్న నోటితో కాకుండా, ఆ ప్రశ్నార్థకం మొహంలో చూపించింది రూప తల్లి. తల్లి మొహంలో వున్న ఆత్రుతచూసి ఈసారన్నా వుద్యోగంవస్తే బాగుండును అనుకుని 'సాయంత్రం మళ్ళీ కన్పించమన్నారు' అంది రూప.

పచ్చడి అన్నం తిని కంచం తీస్తూ "అమ్మా సాయంత్ర నించీ గంజి కుక్కకి పొయ్యకు. దాని అవసరం మనకే ఎక్కువగా వుంది" అంది కంఠంలో ఎటువంటి భావం విన్పించనివ్వకుండా. కాని మనస్సులో దుఃఖంగానే వుంది. యింకా ఎన్నాళ్ళీ కష్టాల బ్రతుకు బ్రతకాలి? ఆ మాట విన్న తల్లి కళ్ళలో నిండిన కన్నీరు చీర చెంగుతో అద్దుకుంది. ఆ అద్దుకోవడంలో చీర చెంగు ఒకచోట సర్రుమని చిరిగింది.

"రూపమ్మా నీకు ఉద్యోగం రాంగానే కాస్త నా మందుల సంగతి చూడమ్మా. ఈ బాధ భరించలేకుండా వున్నాను" తండ్రి కోరిక

"అక్కా నేను మళ్ళీ స్కూల్లో చేరతానే-హోటల్లో బాయ్‌గా పని చెయ్యలేను. తప్పకుండా స్కూలు ఫీజుకి డబ్బు యిస్తావు కదూ"-తమ్ముడి ఆశ.

"మరీ ఇంటరు చదువుతూ యింత చిరిగిపోయిన బట్టలు తొడుక్కెళ్ళాలంటే సిగ్గుగా వుంటోందే అక్కా" చెల్లెలు ఆవేదన.

ఆఖరి పిల్లలు ముగ్గురూ రోజూ పచ్చడి అన్నం కాక పెరుగన్నం, చాక్లెట్లు పెడితే బావుంటుందని సూచించారు.

నాలుగు సంవత్సరాలుగా ఆమె యింటర్వ్యూనించి వచ్చిన ప్రతీసారి ఇవే కోరికలు ఆశలు వింటోంది. అలాగే అని తల వూపుతోంది. కాని వుద్యోగం దొరకటం గగన కుసుమాన్ని అందుకొనే వ్యర్థ ప్రయత్నంలా ఉంది.

సూర్యుడు పడమటివైపుకి ప్రయాణం సాగిస్తున్నాడు. రూప నాగేంద్రగారి బంగళావైపు నడుస్తోంది.

"ఏమేవ్ చూశావు-మళ్ళీ బయల్దేరింది.

సాయంత్రం సింగారించుకుని ఎవడితో కులకటానికి . వెడుతోందో" ఒక సంసార స్త్రీ నేర్చుకున్న భాష అది.

"ఈ పిట్ట రేటెంతో తెలిస్తే బాగుండు నురా?"

"రేటు కూడా ఎందుకురా బాగా చెడిపోయిన బాపతు. చీకటిపడ్డాక సందుచివర కాపేసి చెయ్యట్టుకో—నీకూడా కుక్కలా వచ్చేస్తుంది" కొందరు మగవాళ్ళ పేలాపన అది.

ఇవన్నీ రూప చెవులు వింటూనే వున్నాయి. మనసు ఈ మాటలన్నీ టేప్ చేస్తోంది. మెదడు ఆలోచిస్తూ మాట్లాడుతోంది. "శీలాన్ని నీచంగా అమ్మకోగలిగితే తను ఈనాడు యిలా సాయంసంధ్య వేళ ఎవరి దయకోసమో పరిగెట్టాల్సిన అవసరం వుండేదా! పతిత కావడానికి, మగవాడి కామం భరించటానికి ఏ ఆడదిమాత్రం యిష్టపడుతుంది. ఆకలిని, అన్యాయాన్ని, కన్నీళ్ళని, కడగళ్ళని దిగమింగుకుంటోందే గాని ఈ మగవారి చేతులో ఆటబొమ్మ కావాలనుకోవటం లేదే? ఆశతో బ్రతుకుతోంది ఆకలితో బ్రతుకుతోంది. అవహేళనలలో బ్రతుకుతోంది. ఎందుకు? తనకీ మానాభిమానాలు వున్నాయని, తనకీ శీలమున్న ఆడదానిలా గౌరవంగా బ్రతకాలని వుందని సమాజానికి ఎప్పటికయినా తెలియపర్చాలని యింకా యిలా బ్రతుకుతోంది. ఈ కష్టకాలంపోయి సుఖపడేకాలం వస్తుంది. అమావాస్య తర్వాత పౌర్ణమి వచ్చినట్లు" ఆలోచనల్లోనే చేరాల్సిన గమ్యానికి వచ్చేసింది.

నాగేంద్ర రూపని సగౌరవంగా లోపలికి ఆహ్వానించాడు. అతిధి మర్యాదలు జరిగాయి. ఉద్యోగంలో చేరటానికి ఎప్పుడు రమ్మంటారు? అడ్వాన్సు యిస్తారా? అని ఆలోచిస్తోంది రూప.

"నాకు సూటిగా మాట్లాడటం అంటే యిష్టం. నువ్వు గమనించావో లేదో నేను యింటర్వ్యూలో కూడా సూటిగానే ప్రశ్నలడిగాను" అని ఆపి రూపమొహంలోకి చూశాడు.

రూపకి అర్థం కాలేదు. ఈ వుపోద్ఘాతం ఎందుకో. ఆమె మొహంలో అమాయకతని అందాన్ని ఆస్వాదిస్తూ "నువ్వు యింటర్వ్యూకి వచ్చిన ఉద్యోగం గవర్నరుగారి దగ్గరనించి రికమెండేషను తెచ్చుకుని, పదివేలు సమర్పించుకున్న అభ్యర్థికి యిచ్చేశాను" అన్నాడు.

"మరి నన్నెందుకు పిలిపించారు?" ఆమె కళ్ళముందు పంచరంగుల కల తిరిగిపోతోంది.

నాగేంద్ర మీసాలు సవరించుకుంటూ "ఆ ఉద్యోగం పోయిందని బాధపడకు నేను తలుచుకున్నాను అంటే మరో ఉద్యోగం నీ కోసం ప్రత్యేకంగా సృష్టించగలను. ఆఫీసులో పెద్దగా ఏమీ పని వుండదు. అయితే సాయంత్రం మట్టుకు రెండు మూడు గంటలు నాతో గడపాల్సి వుంటుంది" అన్నాడు.

రూపకి విషయం పూర్తిగా అర్థం అయింది. అవమానం, కసి ఆమె మొహంలో కన్పించాయి—"వుంపుడుకత్తె వుద్యోగం అన్నమాట".

"మరీ అంత నగ్నంగా మాట్లాడకు."

"మీరు చెప్పిన సూటయిన వుద్యోగానికి అంతకన్నా సూటయిన పేరు నాకు ఇంకోటి తట్టలేదు."

"సరే పోనీ నీకి వుద్యోగం నచ్చనట్టుంది. నేను నువ్వు వస్తున్నావని ఇంకో అమ్మాయిని తెప్పించుకోవటం మానేశాను. యివ్వాల్టికి టెంపరరీగా ఉద్యోగం చెయ్యి" అన్నాడు రూప చెయ్యి పట్టుకుని తనమీదకి లాక్కుంటూ. ఆకాశంలో చీకటి. రూప మనస్సులో చీకటి. ఆమె చేతుల్లో మాత్రం ఎర్రటి రక్తం త్రాగి నృత్యం చేసిన యినుపకడ్డీ.

నాగేంద్రని చంపినందుకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూసిన గమ్యం రానే వచ్చింది వైకుంఠపాళిలో చిన్నపామునైతే దాటుకు వచ్చింది కాని సమాజరీతి దొంగ న్యాయపు విలువనే పెద్దపాము చివరికి ఆమెని మింగేసింది.

*  *

కుటుంబాన్ని పోషించాల్సిన రూపక్క డిగ్రీ చదివి నాలుగు సంవత్సరాలు చెప్పులు అరగదీసుకుని చివరికి హంతకురాలైంది.

ఎలాగో కష్టాలుపడి తను యింటర్ పూర్తిచేసింది. కాని యెవరిస్తారు ఉద్యోగం?

అక్క వదిలేసి వెళ్ళిపోయిన మార్గంలో యిప్పుడు శ్రీల పయనిస్తోంది. రోజులు వారాలు గడుస్తున్నాయి. ఆకలి అసహనం పెరుగుతోంది.

ఇలాంటి రోజుల్లో ఒక రోజు....

శ్రీల యింటి ముందుకి యింపాలా కారు వచ్చి ఆగింది. అందులోంచి అందమైన



చిరునవ్వులతో. అమాయకమైన పెద్ద కళ్ళతోవున్న ఒక యువకుడు దిగాడు.

అతడ్ని. అతడి కారుని శ్రీలేకాక యింటిల్లిపాదీ బిత్తరపోయి ఆశ్చర్యంగా చూస్తున్నారు. శ్రీలకి ఏంచెయ్యాలో తోచక ఎలా మాట్లాడాలో తెలీక అలాగే నిల్చుండిపోయింది. అతను చిరునవ్వుతో శ్రీల దగ్గరికి వచ్చి నమస్కారంచేసి "మీరు రూపాదేవి సిస్టర్ కదూ ?" అన్నాడు.

తన అక్కని యింత గౌరవంగా. మర్యాదగా "రూపాదేవి" అనడం శ్రీల ఈమధ్య కాలంలో విని వుండలేదు. "ముండ.... పతిత.... హంతకురాలు.... నరరూపరాక్షసి కామినీ పిశాచి" అనే సమాజం అక్కని పిలుస్తోంది. ఆశ్చర్యాన్ని ప్రక్కకితోసి "అవును. నా పేరు శ్రీల" అంది ప్రతి నమస్కారంచేస్తూ

"మీకు నా పేరు తెలీదుకదూ. నా పేరు ఫణీంద్ర. మీ అక్క రూపాదేవి చంపింది ఎవరోన్నికాదు నా తండ్రినే" అన్నాడు ఫణి.

భయంతో శ్రీల మొహం కుంచించుకు పోయింది. తన తండ్రి చావుకి యిప్పుడు తమ మీద ప్రతీకారం తీర్చుకోడానికి వచ్చారా.

శ్రీల మొహంలో భయాన్ని చూసి నవ్వుతూ "మీరు ఏమీ భయపడకండి. నా గురించి కొద్దిగా మీతో చెప్పుకోవాలి. ఎప్పుడో నేనే నా తండ్రిని చంపేద్దామనుకున్నా. కాని నాకు ఆ సమస్య లేకుండా చేశారు మీ అక్క. మీరు ఆశ్చర్యపోవచ్చు ఎక్కడయినా తండ్రిని కొడుకు చంపుదామనుకుంటాడా అని. నా తండ్రి... అలా అనుకోవడానికి సిగ్గేస్తోంది. నా తల్లిని నానాహింసలు పాలుచేసి. మానసికంగా ఆమెని చచ్చేటట్టు చేసి. ఆమె పేరనున్న ఆస్తిని తన పేర వ్రాయించుకున్నాడు. ఆ ఆస్తితో విలాసాలు మరిగి ఎంతోమంది ఆడవాళ్ళ జీవితాల్ని నాశనం చేశాడు. నన్ను నా తల్లిని నానా కష్టాలు పెట్టాడు. అలాంటి నరరూప రాక్షసుడ్ని చంపి నాకు. నా తల్లికి ఎంతో మేలు చేశారు మీ అక్క. మీరు ఉద్యోగం కోసం వెదుకుతున్నారు అని తెల్సింది. రేపే నా కంపెనీలో టైపిస్టు జాబ్ ఖాళీగావుంది వచ్చి చేరండి" అన్నాడు.

శ్రీల మొహం వెలిగిపోయింది ఆనందంతో సమాజంలో యింకా మంచితనం చచ్చిపోలేదు బ్రతికేవుందని ఆనందపడింది నమ్మింది.

ఫణి మరికాసేపు వుండి. వాళ్ళ యింటి కష్టాలని. కన్నీళ్ళని సానుభూతిగా విని వెళ్ళిపోయాడు.

ఉద్యోగంలో చేరింది. మర్చిపోయిన నవ్వులు. సంతోషం. ప్రశాంతత నెలకొన్నాయి ఇంట్లో.

రూపక్క తిట్టినంతగా కుళ్ళిపోలేదు ఈ సమాజం అనుకుంది శీల నీటిలో దిగిన వాళ్ళకే లోతు తెలుస్తుంది అనే విషయం మర్చిపోయింది శ్రీల.

ఫణి చెప్పిన మంచి మాటలి. అందమైన చిరునవ్వుకి. చూపిన ఔదార్యానికి. న్యాయానికి ఫలితంగా శ్రీలకి మూడోనెల గర్భం. తండ్రి అడ్డులేదు. తల్లి మంచిది. అతను అన్నట్టుగానే తనను పెళ్ళి చేసుకుంటాడని నమ్మింది. ఆ అందమైన నమ్మకమే పాములా తిరగబడి కాటేసింది. శీలం పోయింది. ఉద్యోగం పోయింది. తలెత్తుకు తిరగగలిగే ధైర్యం పోయింది. రూపక్క నగ్నంగా కన్పించిన వాస్తవం కాబట్టి ఎదుర్కొంది. కాని తను... మంచి మాటలు. మెత్తని నవ్వుల ముసుగులో వచ్చిన వ్యాఘ్రాన్ని గుర్తించక మేక అనుకుని మోసపోయింది. చిన్నప్పుడు పరీక్షలో "పయోముఖ విషకుంభం" అనే పదానికి అర్థం తెలీక వదిలేసింది.

కాని యిప్పుడు "పయోముఖ విషకుంభం"గా వచ్చిన వ్యక్తి మోసం గ్రహించలేకపోయింది.

ఒక జీవితం నాశనం అయింది.

ఈ సమాజంలో క్రూరత్వం. అసమానత తర తరానికి పెరిగిపోతున్నాయిగాని తరగటంలేదు. మోసాలు కొత్త కొత్త రకాలుగా జరుపబడుతున్నాయిగాని మంచితనం. మానవత్వం నెలకొల్పబడడంలేదు.

ఎక్కడిన్నించో
చెల్లెలా చెల్లెలా
శ్రీలావోతమ్మా
కలిగున్నా పాము నిన్ను
కాటేసిందమ్మా.

ఎవరి కంఠమో చించుకుని వినవస్తోంది.

అక్క శీలంకోసం హంతకురాలయింది. తను శీలం పోగొట్టుకుని తన్ను తాను హత్య చేసుకోబోతోంది.

ఫణి ఏమన్నాడు ఆఖరిసారిగా విడిపోయేటప్పుడు....

"మా నాన్న సాధించలేనిది నేను సాధించాను."

ఎంత క్రూరమైనమాట. ఆ అందమైన నవ్వు వెనుక.

ఈ సమాజంలో విలువలు లేవా ?

కేవలం మగవాడి కామం. తృష్ణ. మృగత్వం తప్ప.

ఈ సమాజం తను మోసపోయిందని జాలి చూపిస్తుందా? ఛస్తే చూపించదు. శీల పవిత్రత గురించి ఉపన్యాసాలు దంచుతూనే చివరికి తనలాంటి అభాగ్యురాళ్ళకి. వాళ్ళే కుక్కలు చింపిన విస్తరాకుల్లా చేస్తారు. రూపక్కని ఏం చేశారు వీళ్ళు ? స్త్రీ శీలానికి రక్షణ యివ్వలేని ఈ సమాజం తమని శిక్షించే హక్కు ఎక్కడ్నించి తెచ్చుకుంది. కాటు వెయ్యడం తప్ప నీడ ఇవ్వడం తెలీని సమాజ న్యాయం. నీతి సూక్తులు ఎవరికి కావాలి?



నవలల ధర ఎక్కువ!
నవలతోపాటు నవరసాలున్న స్వాతి వెలతక్కువ!